క్లుప్తంగా

నేటి నుంచి గోపాలస్వాముల కల్యాణోత్సవాలు



సిద్ధాంతంలో విజయ గోపాలస్వామి

పెనుగొండ: సిద్ధాంతంలోని రుక్మిణి సత్యభామ సమేత విజయగోపాల స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత మాధవ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల సత్య నారాయణ సోమవారం విలేకరులకు చెప్పారు. మంగళవారం కల్యాణం, గరుడోత్సవం, 21న బుర్రకథ, 22న సదస్యం, మ్యూజికల్ నైట్, 26న పుష్పోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆచంటలో ఉచిత వైద్య శిబిరం



ఆచంట వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

పెనుగొండ: ఆచంటలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో సోమవారం జనరల్ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, కంటి, గుండె జబ్బులకు సంబంధించి 100 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి, వారికి కిమ్స్‌లో వైద్యం చేయడానికి కార్డులు జారీ చేశారు. వారిని బస్సులలో ఉచితంగా తీసుకువెళ్లి వైద్యం చేయించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గాలక్ష్మణేశ్వరస్వామి హుండీ లెక్కింపు



దుర్గాలక్ష్మణేశ్వరుని హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామివారి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. భీమవరం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో రూ.3,55,089 ఆదాయం వచ్చినట్లు తెలియజేశారు. ఆలయం ఈవో చాగంటి సురేష్‌నాయుడు, చైర్మన్ కంకటాల పెద్దిరాజు, కవురు రామాంజనేయులు, చింతపల్లి త్యాగరాజు, ఆలయ సిబ్బంది డి.రామకృష్ణంరాజు, ఈవో బి.శ్రీనివాసరెడ్డి, ఎం.రమేష్, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీపుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు



వాలమర్రులో ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాలమర్రు గ్రామ నడివీధిలో గ్రామ దేవత శ్రీపుంతలో ముసలమ్మ ఆలయ పునఃనిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గ్రామంలో గోపూజ నిర్వహించి, గోమాతతో గ్రామోత్సవం చేశారు. అర్చకస్వామి స్థభితి శ్రీనివాస్ సిద్ధాంతి (జక్కరం), అక్కిరాజు శర్మ శిష్య బృందం బ్రహ్మత్వంలో గ్రామ పెద్దలు నార్ని నారాయణస్వామి, వేంద్ర సింహాచలం, తమ్మా కోట నరసింహరావు, కడలి శ్రీను, సన్నిశెట్టి వెంకటప్రసాద్ దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఈ నెల 20న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

నేటి నుంచి తిల్లపాయిలమ్మ జాతర

పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీ తిల్లపాయిలమ్మ, శ్రీ మారెమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత కామిశెట్టి అయ్యప్పనాయుడు, సర్పంచ్ నడపన శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం అంతర్వేది సముద్ర స్నానానికి అమ్మవార్లను తీసుకువెళతామన్నారు. రాత్రి ఆసాదుల నృత్యాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, 25న గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నీతి, నిజాయతీతో అభివృద్ధే ధ్యేయంగా పనిచేశా

- రూ.4,045 కోట్లతో నరసాపురం నియోజకవర్గం అభివృద్ధి
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1,461 కోట్లు అందించాం
- మళ్లీ ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది
- నేడు గొంది గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తా
- విలేకరులతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: గత ఎన్నికల్లో నరసాపురం ఎమ్మెల్యేగా ప్రజలు తనకిచ్చిన అవకాశానికి పూర్తిస్థాయిలో న్యాయం చేశానని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఈ ఐదేళ్ల నీతి నిజాయతీతో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశానని చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో నరసాపురం నియోజకవర్గం నుంచి మళ్లీ వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 70 వేల కుటుంబాలు ఉండగా, 62,800 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించినందుకు గర్వంగా ఉందన్నారు. కుల, మత, పార్టీ విబేధాలు చూడకుండా ఎక్కడా పైసా అవినీతిలేకుండా సంక్షేమ పథకాలు గడపగడపకు అందించామన్నారు. నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గంలో రూ.1,461 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేశామన్నారు.

దీర్ఘకాల ప్రాజెక్టులకు మోక్షం

గోదావరిపై వశిష్ఠ వంతెన, కాళీపట్నం రెగ్యులేటర్ల నిర్మాణం, బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్ నిర్మాణం వంటి దీర్ఘకాల పెండింగ్ ప్రాజెక్టలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మోక్షం కలిగిందన్నారు. రూ.430 కోట్లతో చేపట్టిన ఫిషరీస్ యూనివర్సిటీ పనులు చురుగ్గా సాగుతున్నాయని, తాత్కాలిక భవనంలో యూనివర్సిటీ తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. అలాగే రూ.450 కోట్లతో ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. వశిష్ఠ వంతెనకు టెండర్లు పిలిచారని, ఏప్రిల్‌లో టెండర్లు తెరుస్తారన్నారు. మున్సిపాలిటీలో రూ.220 కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీకి సంబంధించి మొదటిఫేజ్‌లో రూ.87 కోట్ల పనులకు టెండర్లు పిలిచారన్నారు. కాళీపట్నం జమిందారీ భూసమస్యను తీర్చి 5,500 ఎకరాల భూములను హక్కుదారులైన రైతులకు ఇస్తున్నామన్నారు. మరో దీర్ఘకాల రైతుల సమస్య అయిన దర్భరేవు కంపెనీ భూములను హక్కుదారులకు ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఖర్చులు పెట్టుకుని చేయించిందన్నారు. రూ.133 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని చెప్పారు. పక్కా జీవోలతో తెచ్చిన ఈ ప్రాజెక్టలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. రూ.13 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, రూ.4.80 కోట్లతో బస్టాండ్ ఆధునికీకరణ, రూ.3 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం, పేరుపాలెం బీచ్ అభివృద్ధి, కాటన్‌పార్కు అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి, ఇరిగేషన్, మంచినీటి సరఫరా పనుల కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులకు రూ.4,045 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. దీనిలో జిల్లాకు సంబంధించిన రూ.1400 కోట్ల అంచనా గల వాటర్‌గ్రిడ్ ప్రాజెక్ట్ ఉందన్నారు. మిగిలినవి అన్నీ నరసాపురం నియోజకవర్గానికి సంబంధించినవేనని చెప్పారు. పార్టీ క్యాడెర్‌కు కూడా పెద్దపీట వేశామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నియోజకవర్గంలో ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా లేదని, తమ ప్రభుత్వం హయాంలో నాలుగు జూనియర్ కళాశాలలను మంజూరు చేశామన్నారు. అలాగే సరిపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు 10 ఎకరాల స్థలం సేకరించామని వివరించారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

నేటి నుంచి ప్రచారం

నియోజకవర్గంలో మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు. నరసాపురం మండలం గొంది గ్రామంలో ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రచారం మొదలుపెడతానని చెప్పారు. నూరుశాతం హామీలు అమలు చేసి అభివృద్ధి, సంక్షేమం విషయంలో నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలిపిన తనకు, తన పార్టీకి మాత్రమే ఓటు అడిగే నైతికహక్కు ఉందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కామన బుజ్జి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, తెన్నేటి గిరి, అడిదల శరత్, గోరు సత్తిబాబు, నేతల జయరాజు, కావలి నాని, చదలవాడ మెర్లిన్ పాల్గొన్నారు.

నేడు బ్రాడీపేటలో గుడాల గోపి ప్రచారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 1వ వార్డు బ్రాడీపేట 1వ వీధి నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మంగళవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని వారు కోరారు.

నేడు ఆశీల వేలం పాట

నరసాపురం: పట్టణంలోని డైలీ మార్కెట్ పన్నుల వసూళ్లపై 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హక్కులు కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు రూ.3 లక్షల ధరావత్తు చెల్లించాలని, రూ.5 లక్షలు సాల్వెన్సీ చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

పెనుగొండ: విధుల్లో అలసత్వం వహించిన పోడూరు, కవిటం, నెగ్గిపూడి, నడిపూడి గ్రామాల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎన్నికల అధికారి స్వామినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఆయా గ్రామాల్లో విగ్రహాలకు ముసుగు వేయడం, రాజకీయ ఫ్లెక్సీల తొలగింపులో అలసత్వం వహించడంతో ఈ మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి



ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

నరసాపురం: వైఎస్సార్‌సీపీ నాయకులు సైనికుల్లా పనిచేసి జరగనున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. ఇటీవల నరసాపురం పట్టణం, మొగల్తూరు మండల ఎస్సీసెల్ అధ్యక్షులుగా నియమితులైన సిర్రా విల్సన్, కోడెల వెంకట్రావు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రసాదరాజును కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలన్నా, సంక్షేమం ప్రజలకు చేరాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్‌కెనడీ, ముసూడి రత్నం, ముసూడి రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించిన సీఎం జగన్



తూర్పుపాలెంలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును కలిసిన పెనుగొండ జిలం చెరువు పెద్దలు

పెనుగొండ: ఐదేళ్ల పాలనలోనూ, సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. జిలం చెరువులో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రహదారి నిర్మాణం పూర్తిచేసి, కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించినందుకు గాను సోమవారం తూర్పుపాలెంలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును కలసి కృతజ్ఞతలు తెలిపి, రాబోయే ఎన్నికల్లో పార్టీకి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా మత్స్యకార సమస్యలను పరిష్కరించడంతో కమ్యూనిటీ భవన ఏర్పాటుకు సహకరిస్తున్న శ్రీరంగనాథరాజును మత్స్యకార సంఘ నాయకులు కలసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలను మోసం చేసి తెలుగుదేశం పార్టీ ఇప్పటివరకూ మభ్యపెడుతూ వచ్చిందన్నారు. బీసీలను అణచివేతకు గురిచేసి వారిని మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనన్నారు. సీఎం వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్ ఇచ్చిన మాటకు కట్టుబడి సామాజిక న్యాయం పాటిస్తూ పాలన కొనసాగించారన్నారు. మరోసారి బీసీలకు అధికంగా సీట్లు కేటాయించారన్నారు. బీసీలందరూ సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరావు, కేవీఎస్ నారాయణ రెడ్డి (వాసు), పంచాయతీ సభ్యుడు పిల్లి చాముండేశ్వరరావు, కుడిపూడి సుబ్రహ్మణ్యం, తిక్కిరెడ్డి పవన్‌కుమార్, గుబ్బల వీరబ్రహ్మం, ఎస్సీ సెల్ కన్వీనర్ పలివెల శ్రీను, జిలం చెరువు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజును కలిసిన విన్‌స్టన్‌బాబు



ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న విన్‌స్టన్‌బాబు

పోడూరు: ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు కుంచలపల్లి విన్‌స్టన్ బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీరంగనాథరాజు పేరును ప్రకటించడంపై విన్‌స్టన్‌బాబు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. శ్రీరంగనాథరాజును ఆచంట ఎమ్మెల్యేగా భారీమెజార్టీతో గెలిపించేందుకు పార్టీ యూత్ విభాగం పోరాట పటిమతో సైన్యంలా పనిచేస్తుందన్నారు. విన్‌స్టన్‌బాబుతో పాటు పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నర్సయ్య, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి మరపట్ల ప్రవీణ్‌కుమార్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి సాలా శ్రీను, జాన్ తదితరులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును కలిశారు.

తొలిరోజు ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



పాలకొల్లులో ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



ముత్యాలపల్లి కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పాలకొల్లు పట్టణంలో 9, మండలంలో 3, యలమంచిలి మండలంలో 5, పోడూరు మండలంలో 3 మొత్తం 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం నియోజకవర్గంలో 3,313 మంది విద్యార్థులకు గాను 2,969 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 344 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తొలుత పట్టణంలోని శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కొరాడ శ్రీనివాసరావు విద్యార్థులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పరీక్షలు అయ్యేవరకూ పరీక్షా క్షేంద్రాల వద్దే వేచి ఉన్నారు.

పది పరీక్షలకు 69 మంది గైర్హాజరు

మొగల్తూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆరు పరీక్షా కేంద్రాల్లో సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 922 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 853 మంది హాజరుకాగా, 69 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శామ్యూల్ జాన్ చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

యలమంచిలిలో 72 మంది గైర్హాజరు

యలమంచిలి: మండలంలో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. యలమంచిలి, కాజ తూర్పు, ఏనుగువానిలంక, మట్లపాలెం, దొడ్డిపట్ల హైస్కూల్స్‌లోని పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు రెగ్యులర్, నాన్ రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 685 మంది హాజరయ్యారు. 72 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ కె.రామకృష్ణంరాజు తెలిపారు.

పెనుమంట్రలో 71 మంది గైర్హాజరు

పెనుమంట్ర: మండలంలో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగు పరీక్షా కేంద్రాల్లో 590 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 519 మంది హాజరైనట్లు ఎంఈవో యు.నాగేశ్వరరావు చెప్పారు. పెనుమంట్ర జడ్పీ హైస్కూల్‌లో 187 మంది, పాలమూరులో 77 మంది, మార్టేరు హైస్కూల్‌లో 170 మంది, మార్టేరు బాలికోన్నత పాఠశాలలో 85 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరయ్యారని, మొత్తం మీద 71 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

నరసాపురం మండలంలో 90 మంది గైర్హాజరు

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నరసాపురం మండలానికి సంబంధించి 39 పాఠశాలలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, గతేడాది పరీక్ష తప్పిన విద్యార్థులు వెరసి 1,869 మంది విద్యార్థులు మొదటి రోజున తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,779 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 90 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో పిల్లి పుష్పరాజ్యం చెప్పారు. నరసాపురం పట్టణంలోని టేలర్ హైస్కూల్, మిషన్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు.

సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



కాజలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్

యలమంచిలి: దాళ్వాలో కాలువ శివారు భూములకు సైతం సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ చెప్పారు. కాజ గ్రామానికి చెందిన రైతులు కాల్వ శివారు భూములకు సాగునీరు అందడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆర్డీఓ అధికారులతో కలిసి కాజ గ్రామంలో వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తడారిన చేలను చూపించారు. దీంతో అంబరీష్ అక్కడే ఉన్న ఇరిగేషన్ డీఈ సీహెచ్ సత్యనారాయణ నుంచి వివరణ కోరారు. డీఈ సత్యనారాయణ ప్రస్తుతం వంతుల వారీ విధానం అమలులో ఉందని, ఈ నెల 21న ఈ పంట కాల్వకు వంతు వస్తుందని, ఆ సమయంలో ప్రతి చేనుకు నీరు అందిస్తామని చెప్పారు. దీనిపై అంబరీష్ స్పందిస్తూ ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, ఏఈ చిందులూరి దేవి, ఇరిగేషన్ ఏఈ సల్లపూడి శ్రీనివాస్ ఉన్నారు.


20న కనకదుర్గ మల్లేశ్వరస్వామి కల్యాణం



శ్రీ కనకదుర్గమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్ల బజారు సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7.15 గంటలకు అమ్మవారి ధ్వజారోహణము పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం రాత్రి 7.29 గంటలకు కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం, గురువారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఊరేగింపు, శుక్రవారం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, లక్ష దీపాలంకరణ, శనివారం రాత్రి దర్బారుసేవ, సోమవారం ఉదయం పూర్ణాహుతి, దండాడింపు ఉత్సవము, త్రిశూలస్నానం రాత్రి 7 గంటలకు అమ్మవారికి లక్ష చామంతి పువ్వులతో పూజ, మంగళవారం లక్ష గాజుల పూజ, బుధవారం ఏకాంతసేవ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవ కార్యక్రమాలు ముగించనున్నారు. ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ఈవో యస్ సతీష్‌కుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు రేలంగి నరసింహమూర్తి, గవర రవిశంకర్, గుండుబోయిన అరుణకుమారి, దాసరి దివ్యశ్రీ, మాదేటి మంగాకుమారి, తాతపూడి శ్రీరాములు ఆలయ సిబ్బంది ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొన్నారు.

పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో బాబ్జిరాజు

మొగల్తూరు: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వీఆర్వోలతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గతంలో ఏర్పాటు చేసిన బ్యానర్లు, జెండాలు తీసివేయాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలు కనపడకుండా ముసుగు వేయించాలన్నారు. రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు రాకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ భాస్కర్, ఎస్సై కె.వెంకటరమణ పాల్గొన్నారు.

దళితులంతా ఐక్యంగా ఉండాలి

పోడూరు: సంక్షేమం, అభివృద్ధి కోసం దళితులందరూ ఐక్యంగా ఉండాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ కోరారు. పండితవిల్లూరులో సోమవారం సంఘ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం గ్రామం దేవునితోటలో వేంచేసియున్న అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ఈనెల 15న ప్రారంభమైన ఉత్సవాలు 20వ తేదీ వరకు కొనసాగుతాయి. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టపర్రు బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.